


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం 30 | జనవరి, 2026 | పేజీలు :06




# గద్దెపైకి సమ్మక్క

- చిలకల గుట్ట నుండి భారీ పోలీసు బందోబస్తు మధ్య సమ్మక్కను గద్దెకు చేర్చిన పూజారులు
- లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు
- ఇప్పటికే 80లక్షలు దాటినట్లుగా అంచనా
- దర్శించుకున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- జనసంద్రాన్ని తలపిస్తున్న మేడారం

వివరాలు మెయిన్‌లో...





## ఎల్‌ఒసి మంజూరు

**ప్రజాపక్షం/జనగామ టౌన్ :** మండలంలోని శామీర్‌పేట గ్రామానికి చెందిన మాజీ పిఏసిఎస్ చైర్మన్ చందగొండ రాంరెడ్డి వైద్య చికిత్స నిమిత్తం భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.1.75లక్షల ఎల్‌ఒసి మంజూరు చేయించారు. రాంరెడ్డి అనారోగ్య విషయాన్ని స్థానిక సర్పంచ్ వనిత, రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి ఎంపి ద్వారా ఈ ఆర్థిక సహాయం అందేలా చూశారు.ఈ మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేయగా వారు ఎంపికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, సత్తిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యంత్రాల కొనుగోలుపై సబ్సిడీ

**ప్రజాపక్షం/జనగామ టౌన్ :** వ్యవసాయ యాంత్రీకరణ పథకం లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు, డిఆర్‌డివో, ఎపిఎంలతో జిల్లా కలెక్టర్ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించారు. ఎస్ఎంఎఎం పథకంలో భాగంగా జనగామ జిల్లాకు 2025–26 సంవ్సరానికి గాను వానాకాలంలో రూ. 2.73 కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందని ఈ పథకంలో బ్యాటరీ పంపులు, తైవాన్ పంపులు, రోటవేటర్లు, విత్తనాలు నాటే మిషన్లు, కెజి వీల్స్, కలుపు తీసే యంత్రాలు, గడ్డి కట్టె యంత్రాలు, పవర్ టిల్లర్ పరికరాలు మంజూరయ్యాయన్నారు. రైతులకు నచ్చిన పరికరాన్ని ఎన్నుకుని సంబంధిత కంపెనీలకు రాయితీ పోను మిగతా డబ్బులు డిడిలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా రైతులు వ్యవసాయ యాంత్రిక పరికరాలను కొనుగోలు చేసి ఆర్థికంగా లబ్ధి పొందాలని కలెక్టర్ తెలిపారు.

## కెసిఆర్‌కు నోటీసులు ఇస్తే కాంగ్రెస్ పతనం ఖాయం

వేముల లక్ష్మణ్‌గౌడ్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట :** మాజీ సిఎం కెసిఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో విచారణకు పిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ అంతానికి నాంది అవుతుందని బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వేముల లక్ష్మణ్‌గౌడ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు తెరలేపిందన్నారు. ఇప్పటికే కెటిఆర్, హరీష్‌రావు, సంతోష్‌రావులను వేధించారని మండిపడ్డారు. రాష్ట్రం కోసం జీవితాన్ని అంకితం చేసిన కెసిఆర్‌పై సిట్ విచారణలు, కమిషన్ల పేరుతో ఒత్తిడి తేవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అన్నారు.

## విద్యార్థులకు అస్వస్థత

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** నారాయణఖేడ్ మండలంలోని ఎంపిపిఎస్ వెంకటాపూర్ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం తిని (17) మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనారు. గమనించిన వెంటనే విద్యార్థులను నారాయణ ఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికు తరిలించినట్లు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

# మేడారం జాతరలో నిరంతర విద్యుత్

### విద్యుత్ శాఖ అధికారుల నిరంతర ఏర్పాట్లు



**ప్రజాపక్షం/హనుమకొండ :** మేడారంలో రౌండ్ ద క్లాక్ విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా తీరు తెన్నులను పర్యవేక్షిస్తున్నారని డైరెక్టర్ ఆపరేషన్ , ప్రాజెక్ట్స్ టి.మధుసూదన్ , మోహన్ రావు తెలిపారు. విద్యుత్ పరంగా మేడారంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సత్వర చర్యలు తీసుకుంటూ మిరుమిట్లు గొలిపేలా వెలుగుల మేడారంగా తీర్చిదిద్దిన ఎన్‌పిడిసిఎల్ అని అన్నారు . వెలుగులు జిగేల్ మనేలా తీరిచిద్దిన మేడారానికి అధికారులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది నిత్యం 24/7 విధులు నిర్వహిస్తున్నారన్నారు. చీఫ్ ఇంజనీర్లు కె. రాజు చౌహన్, ఆశోక్ పర్యవేక్షణలో నలుగురు సూపరిండెంట్ ఇంజనీర్లు, ఏడుగురు డివిజన్ ఇంజనీర్లు, 30 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు 150 నుండి 500 మంది ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు మూడు బ్యాచ్‌ల్లో 30 మంది చొప్పున విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. వీరు తమకు కేటాయించిన ప్రాంతాల్లో లైన్ పెట్రోలింగ్ చేస్తూ లోపాలను గుర్తిస్తూ సరి చేస్తారు. రాత్రి, పగలు లేకుండా అహో రాత్రులు కష్టపడుతూ విధులు నిర్వర్తిస్తూ భక్తులకు విద్యుత్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారు . ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తూ , విద్యుత్ ప్రమాదాలు జరగకుండా లైన్లకు స్పేసర్ లు పెట్టడం జరిగిందని, భద్రతకు పెద్దపీట వేశామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశామని డైరెక్టర్లు టి.మధుసూదన్, వి.మోహన్ రావు తెలియజేశారు. శాశ్వత ప్రాతిపదికన జంపన్న వాగు ఇరువైపులా 6 టవర్లు ఏర్పాటు చేశామని , నిరంతరం ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సిబ్బంది లోడ్ తనిఖీ చేస్తూ ఉంటారని, ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే తెలియజేసేలా రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా వెంటనే సమాచారం కంట్రోల్ రూమ్ కు చేరవేస్తుందని, అక్కడ ఉన్న సిబ్బందికి తెలియజేసి సమస్య పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు విద్యుత్ పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎక్కడ సమస్య దగ్గరలో ఉన్న మా సిబ్బందికి తెలపాలని కోరారు

# రజకులను ఎస్సి జాబితాలో చేర్చాలి

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



**ప్రజాపక్షం/ వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం రజకులను ఎస్సి జాబితాలో చేర్చి వారి అభివృద్ధికి సంక్షేమానికి చర్యలు చేపట్టాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో రజక వృత్తిదారుల సమాఖ్య నూతన క్యాలెండర్ ను బిసి హెచ్‌ఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెల్లి ప్రభాకర్, చిలుకల రాజు తదితరులతో కలిసి ఆవిష్కరించి ప్రసంగిస్తూ రజకులను ఎస్సి జాబితాలో చేర్చాలని అనేక సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాలలో, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్సి జాబితాలో చేర్చారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రజకులను ఎస్సి జాబితాలో చేర్చాలన్నారు. రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లకు పాలక మండలిలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం రజక ఫెడరేషన్‌కు పాలక మండలి ఏర్పాటు చేయకపోవడం నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా పాలక మండలిని ఏర్పాటు చేసి తగిన విధంగా నిధులు కేటాయించాలన్నారు. జిల్లా మండల కేంద్రాలలో, మున్సిపాలిటీలలో రజక సంక్షేమ భవనాలు నిర్మించాలని, 50 సంవత్సరాలు నిండిన రజక వృత్తిదారులకు నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వాగ్దానాల అమలు కోసం, సమస్యల పరిష్కారానికి రజకులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# మన్నాసన్‌పల్లి జాతరకు కొత్త వెలుగులు



**ప్రజాపక్షం/బచ్చన్నపేట :** అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే అమ్మవార్ల సన్నిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని మన్నాసన్‌పల్లి గ్రామంలో వైభవంగా జరుగుతున్న మినీ సమ్మక్క సారలమ్మ జాతరలో గురువారం ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సారలమ్మ అమ్మవారికి (బెల్లం) సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతర గద్దెల వద్ద వెలుతురు కోసం తక్షణమే హైమాస్ లైట్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సందీప్, బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు రమణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు ఫిరోజ్, మాజీ ప్రజాప్రతినిధులు సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య గౌడ్, శ్రీధర్‌గౌడ్, కవిత మురళి, రాధ, ప్రకాశ్, శ్రీధర్‌గౌడ్, శివకుమార్‌గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పుర పాలక ఎన్నికల పరిశీలకులుగా శివ కుమార్ నాయుడు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లాలోని పరకాల పుర పాలక ఎన్నికల సాధారణ పరిశీలకులుగా సీనియర్ ఐఏఎస్ అధికారి శివకుమార్ నాయుడును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడుకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మొక్కను అందించారు. కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు సమావేశమయ్యారు. పరకాల పురపాలక సంస్థకు సంబంధించిన అంశాలను గురించి ఈ సందర్భంగా చర్చించారు.

## గీత కార్మికుడికి గాయాలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** వరంగల్ నగరంలోని అమ్మవారిపేట బట్టుపల్లి సమీపంలో ఉన్న తాటి వనంలో గీత కార్మికుడు వీరగోని కుమారస్వామి(44) తన వృత్తి కల్లు తీసి అమ్ముకొని జీవనోపాధి చేసే క్రమంలో తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి జారి పడి రెండు కాళ్లు విరిగిపోయాయి. అక్కడే ఉన్న తోటి గీత కార్మికులు చూసి వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయగా మెడికవర్ హాస్పటల్‌కు తరలించారు. ప్రభుత్వం పరంగా తమకు న్యాయం చేయాలని గీత కార్మికుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## బిఆర్‌ఎస్ అధినేతకు నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నాం

### మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ పార్టీ అధినేత, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకి సిట్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర సీనియర్ నేత, మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం, కాంగ్రెస్ ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి పరాకాష్ట. తెలంగాణ తెచ్చినందుకే నోటీసులా, తెలంగాణను ప్రగతి పథంలో నడిపించినందుకే నోటీసులా, ప్రజల కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి ఉద్యమం చేసిన నాయకుడిపై ప్రతీకార రాజకీయాలు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చన్నారు. పదేళ్లు కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలతో రైతుకు గౌరవం తెచ్చింది కెసిఆర్ అని, ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు కాళేశ్వరం, మిషన్ కాకతీయ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన దూరదృష్టి కెసిఆర్‌ది అన్నారు. మౌలిక వసతులు,అభివృద్ధి లో భాగంగా, సాగునీరు, త్రాగునీరు, విద్యుత్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు చేశారన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్మిక యూనియన్ నాయకులు బొట్ల భిక్షపతి మాదిగ, వేల్పుల సారంగపాణి యాదవ్‌లు అన్నారు. దేశవ్యాప్త జాతీయ సార్వత్రిక సమ్మెలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సమ్మె నోటీసును అదనపు కమిషనర్ బి.చంద్రశేఖర్‌కు గురువారం అందించారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్, టిఎంఆర్‌పిఎస్ సంఘం, ప్రైవేట్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, టిబిఎంఒకెఎస్ సంఘం మున్సిపల్ సఫాయి జవానుల జెఎసి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12లో జరిగే దేశవ్యాప్త జాతీయ సార్వత్రిక సమ్మెలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొననున్నారని సమ్మె నోటీసు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకురావడాన్ని సరికాదన్నారు. ఈ కోడ్స్‌లు కార్మికుల సమ్మె హక్కును పరిమితం చేస్తాయి, యూనియన్ రిజిస్ట్రేషన్‌ను కష్టతరం చేస్తాయని, ఔట్‌సోర్సింగ్‌ను ప్రోత్సహిస్తాయని, సామూహిక బేరసారి హక్కులను దెబ్బతీస్తాయన్నారు. 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు (సఫాయి కార్మికులు, జవానులు మొదలైనవి) స్థిర ఉద్యోగాలు (రెగ్యులరైజేషన్) కల్పించాలి. కనీస వేతనాల పెంపు, సమాన వేతనం, సామాజిక భద్రత, పెన్షన్, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏల్పుల ధర్మరాజు, మట్టపెల్లి సతీష్ కుమార్, వక్కల రణసాగర్, ఏ. ఎల్లస్వామి, దామెర రాజు, ఎ.సుధాకర్, బి. గట్టయ్య యాదవ్, బి.సాయిరాం, జి.గిరి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని లింగంపల్లి గ్రామ బస్సు ప్రయాణ ప్రాంగణం చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత, డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు గురువారం ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. దళిత సంఘాలు, గ్రామ పెద్దల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొడవటూర్ టెంపుల్ డైరక్టర్ భాస్కర్, మాజీ సర్పంచ్ కిష్టయ్య, నాయకులు శ్రీశైలం, కిష్టయ్య, మసూద్, రాజశేఖర్, కుమారస్వామి, విజయ్, అఖిల్, బాబు, సత్యనారాయణ, నవీన్, ప్రవీణ్, మల్లేశం, సదానందం, ఆంజనేయులు, రాజు, గణేష్, కిష్టయ్య, ఎల్లయ్య, నర్సింహులు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నాయకుల ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** మండలంలోని షాపల్లి గ్రామానికి చెందిన దరిపెల్లి వెంకటయ్య గత 10 రోజుల క్రితం మృతిచెందగా వారి కుటుంబాన్ని బిజెపినాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బిజెపి నాయకులు మృతుని కుటుంబ సభ్యులకు 25 కేజీల బియ్యం అందజేసి మృతుడిచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపిశాపల్లి గ్రామ బీజేవైఎమ్ అధ్యక్షుడు, మండల అధ్యక్షులు సురేష్‌గౌడ్, మండల మాన్ కీ బాత్ కో కన్వీనర్ కార్తీక్, గీత సెల్ కన్వీనర్ ప్రేమ్ నాథ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సిపిఎం అభ్యర్థుల నామినేషన్

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో 3,5 వార్డుల్లో సిపిఎం అభ్యర్థులు నామినేషన్ వేశారు. గురువారం ర్యాలీగా వెళ్లి 3వ వార్డు అభ్యర్థి బూడిద జ్యోతి, 5వ వార్డు అభ్యర్థి జోగు ప్రకాష్ నామినేషన్ వేశారు. వీరిలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆహల్య, బూడిద గోపి, కాంగ్రెస్ నాయకులు మచ్చ ప్రవీన్‌కుమార్ గౌడ్, సమ్మయ్య, రిటైర్డ్ ఉద్యోగి రాంపల్లి యాదగిరిగౌడ్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు రమేష్, ఎండి హజారుద్దీన్, పొత్కనూరి ఉపేందర్, బోడ నరేందర్, బాల్నె వెంకటమల్లయ్యలు ఉన్నారు. అనంతరం మోకు కనకారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. చర్చలు జరుగుతున్నాయని ప్రస్తుతం 3,5వ వార్డుల్లో తమ అభ్యర్థులు నామినేషన్ వేయడం జరిగిందన్నారు.

# మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా ఫణీంద్ర రెడ్డి

**ప్రజాపక్షం/భూపాలపల్లి** :మున్సిపల్ ఎన్నికలకు సాధారణ పరిశీలకులుగా నియమితులైన ఫణీంద్ర రెడ్డి శుక్రవారం నుండి జెన్కో లోని గోదావరి విశ్రాంతి భవనంలో ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎవరికైనా ఫిర్యాదులు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే, సంబంధిత వ్యక్తులు నేరుగా కానీ లేదా 99499 92992 ఫోన్ ద్వారా కాని ఫిర్యాదులను తెలియ చేయాలని ఆయన సూచించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

# మతోన్మాదాన్ని తిప్పికొట్టండి... రాజ్యాంగాన్ని రక్షించండి

## పార్లమెంట్ మాజీ సభ్యురాలు సుభాషిని అలీ



**ప్రజాపక్షం/జనగామ:** మతోన్మాదాన్ని తిప్పికొంటి రాజ్యాంగాన్ని రక్షించాలని పార్లమెంట్ మాజీ సభ్యురాలు సుభాషిని అలీ పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య ముస్లిమ్ సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమంలో జనగామలో జరిగింది. పట్టణంలోని గిర్నిగడ్డ ప్రాంతంలో శుక్రవారం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా సుభాషిని అలీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి అవాజ్ జిల్లా కార్యదర్శి ఎండి అజారుద్దీన్ అధ్యక్షత వహించగా సుభాషిని అలీ పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింలు, హిందువులు కలిసి ఐక్యంగా పోరాడారన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల చేతుల్లో అనేక మంది ముస్లీమ్‌లు చనిపోయారని వారి పేర్లను చదువుతు వినిపించారు. స్వాతంత్ర్య పోరాటంలో తమ ప్రాణాలు అర్పించిన వారిని సైతం దేశ ద్రోహులుగా బిజెపి, ఆర్ఎస్ఎస్ చిత్రీకరించడం సరియైంది కాదన్నారు. ముస్లిం సమరయోధుల పోరాట చరిత్రను ప్రజల్లోకి తీసుకువెళ్లెందుకే ఆవాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఫోటో ఎగ్జిబిషన్ నిర్వయించడం జరుగుతుందన్నారు. జనగామ గడ్డపై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరగగా ఆ పోరాటంలోనూ బందగి మృతి చెందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎ గయాస్, అబ్దుల్ సమద్, ఎండి షబానా, ఇర్రి అహల్య, జోగు ప్రకాష్, ఎండి దస్తగిరి, బొట్ల శేఖర్, బోడ నరేందర్, సుమ, తదితరులు పాల్గొన్నారు. గిర్నిగడ్డలోని ముస్లింలు ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

# కామ్రేడ్ పైల్ల మల్లయ్య వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/రేగొండ** :జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండలం చిన్న కోడిపాక గ్రామంలో కామ్రేడ్ పైల్ల మల్లయ్య నాలుగో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ భూపాలపల్లి జిల్లా సీనియర్ నాయకులు కామ్రేడ్ మామిడాల సమ్మిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ కామ్రేడ్ పైల మల్లయ్య భూమికోసం భుక్తి కోసం శ్రమజీవుల విముక్తి కోసం పోరాటాలు నిర్వహించారని అంతరాలు లేని సమాజం కోసం కృషి చేశారని సిపిఐ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పరకాల తాలూకా ప్రాంతంలో సిపిఐ పార్టీ ఎమ్మెల్యేని గెలిపించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుంటి చంద్రమౌళి మాట్లాడుతూ, ఈ ప్రాంత అభివృద్ధి కోసం కుల వివక్షత నిర్మూలన కోసం ఈ ప్రాంతంలో దున్నే వాడికి భూమి కావాలని నినాదంతో 400 ఎకరాలకు పైబలుక భూములు పంచిన సిపిఐ పార్టీ అని అందులో మల్లయ్య పాత్ర కీలకమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ గ్రామ కార్యదర్శి బొట్ల చంద్రమౌళి, అధ్యక్షత వహించారు. ఇల్లందుల సాంబయ్య, నాగేల్లి బిక్షపతి కూనూర్, లింగమూర్తి ఇల్లందుల చంద్రమౌళి, పప్పుల సారయ్య, బొట్ల నారాయణ, కుటుంబ సభ్యులు శాంతి కుమార్, క్రాంతి కుమార్, వద్దేపల్లి రఘు, మడి కంటి నరసయ్య, అరుణ లావణ్య, స్వర్ణలత కార్తికేయ నాగేష్, దత్త షణ్ముఖ దత్త తదితరులు పాల్గొన్నారు.

# యువత ఓటుతో దేశ ప్రగతికి కృషి




**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, యువత ఓటు హక్కుతో దేశ ప్రగతి కి కృషి చేయాలని జిల్లా యువజన క్రీడల అధికారి రఘు,మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ రవి లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రం లోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో మేర యువ భారత్ వరంగల్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా డివైఎస్ఓ జిల్లా స్పోర్ట్స్ అధికారి రఘు, కళాశాల ప్రిన్సిపాల్ టి.రవి లు పాల్గొని మాట్లాడుతూ, దేశంలోని ఓటర్లను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న భారతదేశంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటారని, ఈ సంవత్సరం కార్యక్రమాన్ని ఘనంగా 25 నుండి 30 వరకు ఓటర్ అవగాహన నిర్వహించి 18 సంవత్సరాలు నిండిన యువ మై భారత్ ఓటర్లను సన్మానించి, కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.అందరు ఓటు హక్కును వినియోగించుకొని దేశ ప్రగతికి పాటుపడాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మై నార్టీ రెసిడెన్షియల్ కోఆర్డినేటర్ వేణు అధ్యాపక అధ్యాపకేతర బృందం మేరా యువ భారత్ వాలంటీర్ వెల్లంద సురేష్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 144 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ అమలు

## సిఐ నరేష్ కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి** :భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కు రాజకీయ పార్టీల నాయకులకు సహకరించాలని భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ఓ ప్రకటన విడుదల చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కొరకు 144 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్ 163 అమలులో అమలవుతుందని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు భూపాలపల్లి మున్సిపల్ పరిధి మొత్తం అమలులో ఉంటాయన్నారు.ఐదుగురికి పైగా వ్యక్తులు గుంపు లుగా చేరడం నిషేధం,అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించడం నిషేధించడం అయిందన్నారు. మైకులు, లౌడ్ స్పీకర్లు, డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగించుటకు పోలీస్ అనుమతి తప్పనిసరని పేర్కొన్నారు. ఆయుధాలు, కర్రలు, కత్తులు, రాడ్లు వంటి ప్రాణాంతక వస్తువులు వెంట తీసుకువెళ్లడం చట్ట విరుద్ధమని, ప్రజల్లో భయాందోళనలు కలిగించే విధంగా రెచ్చగొట్టే ప్రసంగాలు, నినాదాలు, పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచారాలు చేయరాదని తెలిపారు.ఎన్నికల వాతావర ణాన్ని భంగం కలిగించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్టరాదని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# భూపాలపల్లి మున్సిపల్‌లో కొనసాగిన నామినేషన్ల పర్వం

## రెండో రోజు 20 నామినేషన్లు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** భూపాలపల్లి మున్సిపల్‌లో రెండోరోజు గురువారం వార్డు సభ్యుల ఎన్నికలకు అభ్యర్థులు నామినేషన్ సమర్పించారు. మొత్తం 30 వార్డులకు గాను మొదటి రోజు ముగ్గురు అభ్యర్థులు నాల్గు నామినేషన్లు సమర్పించగా, రెండోరోజు 20అభ్యర్థులు నామినేషన్ల సమర్పనతో మొత్తం రెండో రోజు వరకు 24 నామినేషన్లు సమర్పించారు. బిజెపి 7, బిఆర్ఎస్ 11, సిపిఐ 3, స్వతంత్రులు 2 నామినేషన్లు సమర్పించారు. నేటితో నామినేషన్లకు చివరి గడువు కానుంది. గురువారం 4వార్డుకు బిజెపి అభ్యర్థి కన్నం యుగేందర్ బిజెపి నాయకులు చల్ల నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిషిదర్‌రెడ్డి, పాపన్నతో కలిసి నామినేషన్ సమర్పించారు. 3 వార్డుకు బిఆర్ఎస్ అభ్యర్థిగా పి. నారాయణ నామినేషన్ సమర్పించారు.

# ఇంటింటి ప్రచారం చేసిన గోలి మమత సంతోష్ గుప్త

**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 2 వ వార్డ్ కౌన్సిలర్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గోలి మమత సంతోష్ గుప్త గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు బిఆర్ఎస్ పార్టీ వైపు ఉన్నారని, కెసిఆర్ సీఎం గా ఉన్నప్పుడు ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. వార్డు ప్రజలకు సేవ చేయడం కోసం మీ ముందుకు వస్తున్నామని, ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కాగా ఇప్పటికే వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల గుర్తింపు పొందినట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా హిందువులతో పాటు మైనార్టీలు, క్రిస్టియన్లు తమకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వివరించారు.

# మున్సిపల్ ఎన్నికల పరిశీలకులుగా టి.రవి కిరణ్ ఐఎఫ్ఎస్

**ప్రజాపక్షం/మెదక్** :ఎన్నికల నియమాల్లో భాగంగా మెదక్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులుగా టి రవి కిరణ్ ఐఎఫ్ఎస్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు టి.రవి కిరణ్ కు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల తీరును, మున్సిపాలిటీలను, మున్సిపాలిటీలో వార్డుల గురించి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సాధారణ పరిశీలకులు రవి కిరణ్ కు వివరించారు. సాధారణ పరిశీలకులు మెదక్ జిల్లాలోని నాలు మున్సిపాలిటీలలో జరిగే ఎన్నికల సరళిని పరిశీలించారు. అనంతరం మెదక్ మున్సిపల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు సిబ్బంది ఉన్నారు.

# మున్సిపల్ పోరుకు రెండో రోజు 51మంది నామినేషన్లు



**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెండో రోజు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 12వార్డులకు గాను మొదటి రోజు ఏడు నామినేషన్లు దాఖలు కాగా రెండో రోజు గురువారం 51మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ నుండి 24 మంది, బిఆర్ఎస్ నుండి 13 మంది, బిజెపి నుండి 10మంది, నలుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

# మళ్లీ ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా

**ప్రజాపక్షం/నర్సాపూర్:**నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 9 వార్డు 1. వార్డు.లో కౌన్సిలర్ లు మళ్లీ గెలిపించినస్తీతే వార్డు అభివృద్ధికి మరింత కృషి చేస్తానని 9వ వార్డు కౌన్సిలర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీత బాల్ రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కౌంటర్లో తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొంది ఐదు సంవత్సరాలుగా 9 వార్డుకు.1 వార్డు కౌన్సిలర్ లుగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. కాగా మళ్లీ అవకాశం ఇస్తే మరింత అభివృద్ధికి పనులు రోడ్డు నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణాలు, వంటి అభివృద్ధి పనులు ఎమ్మెల్యే సునీతా రెడ్డి సహకారంతో చేస్తాం అన్నారు. అంతేకాకుండా తొమ్మిదో వార్డు ప్రజలు అందరూ నాయకునీగా కాకుండా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారని అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించినందుకు అందరికీ అందుబాటులో ఉండి మళ్లీ సేవ చేసే అవకాశం వచ్చినందున తనకు మళ్లీ అవకాశం ఇచ్చి గెలిపిస్తారన్న ధీమాను అభ్యర్థి సునీతా బాల్ రెడ్డి వ్యక్తం చేశారు. అంతకుముందు నర్సాపూర్ పట్టణంలో భాజా భజంత్రీలతో భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు.

# సమ్మక్క సారలమ్మకు పూజలు చేసిన వంగ రాజేశ్వర్‌రెడ్డి...

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:**సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు వంగ రాజేశ్వర్‌రెడ్డి గురువారం హాజరై వన దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆరోగ్యాంగా ఉండాలని ఆకాంక్షించారు. జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవిత లక్ష్మణ్,మాజీ ఎంపిటిసి గొల్లపల్లి లచ్చయ్య,ఐలయ్య,తిరుపతి,వార్డు మెంబర్ అంజి,కమలాకర్,ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# జన సంద్రంలా మారిన మేడారం

**ప్రజాపక్షం/తాడ్వాయి:**అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు గురువారం లక్షలాదిగా తరలివచ్చారు. భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకోవడానికి లక్షలాదిగా తరలిరాగా క్యూలైన్లు సైతం నిండిపోయి రోడ్ల మీద బారులు తీరారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించడానికి తరలివచ్చారు. క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు జాగ్రత్తగా తీసుకోవడంతో ఎలాటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. రోడ్లపై బారులు తీరిన భక్తులను పోలీసులు ఆపుతూ రద్దీ తగ్గాక పంపుతూ భక్తులకు ఇబ్బందులు ఎదురవ్వకుండా చేశారు. సాధారణ క్యూలైన్లు, విఐపి, వివిఐపి లైన్లు ఏర్పాటు చేశారు. రద్దీ ఉన్న దర్శనం త్వరగా పూర్తి అవడంతో భక్తులు ఒకింత సంతోషం వ్యక్తం చేశారు.

# రోడ్డుపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/గజ్వేల్:**రోడ్డుపై వాహనాలు నడిపించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నేహా పేర్కొన్నారు. గురువారం వర్గల్ మండల కేంద్రంలో అవగాహన కల్పించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులు, విద్యార్థులు, డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే వాహనదారుల కుటుంబాలకు మేలు చేస్తుందని తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణా శాఖ ఇన్చార్జ్ అధికారి లక్ష్మణ్ ఆదేశాల మేరకు భద్రత నియమాలపై కల్పిస్తుండగా, రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడటం ద్వారా ఎంతో మంది మృత్యువాతపడుతున్నార ని ఆవేదన వ్యక్తం చేశారు. దీనినే దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం మహిపాల్, జాఫర్ (అబ్బు), గణేష్, విద్యార్థులు, డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# మెతుకు సీమలో రెండో రోజు 255 నామినేషన్లు



**ప్రజాపక్షం/మెదక్ :**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా రెండో రోజు మెతుకుసీమలో నామినేషన్ల పర్వం కొనసాగింది. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థుల ఉరుకుల, పరుగులతో నాలుగు మున్సిపాలిటీల వద్ద సందడి నెలకొంది. జిల్లాలోని మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాల్టీలలో మొత్తం 75 వార్డులు ఉన్నాయి. గురువారం రెండో రోజు భారీగా 255 నామ పత్రాలను అభ్యర్థులు దాఖలు చేశారు. ఇందులో కాంగ్రెస్ 93, బిఆర్ఎస్ 88, బీజేపీ 48, బీఎస్పీ 01, సిపిఎం 01, ఏడిఆర్ పి 02, ఎంఐఎం 02, స్వతంత్రులు 20 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఉదయం 10:30 గంటల నుంచి 5 గంటల వరకు అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ నేతలు,ఇతర పార్టీ నేతలు, స్వతంత్ర అభ్యర్థులు తరలి వచ్చి జోరుగా తమ నామ పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అభ్యర్థులకు ఆయా పార్టీలు బీఫాంలు అందజేసినట్లు సమాచారం,ఇంకా కొన్ని బీఫాంలు, ఇవ్వనప్పటికీ అభ్యర్థులు ముందస్తుగా నామినేషన్లను దాఖలు చేశారు. జిల్లాలోని మున్సిపాల్టీల్లో అత్యధికంగా మెదక్ లో 103 నామినేషన్లు దాఖలుకాగా, అత్యల్పంగా నర్సాపూర్ లో ముగ్గురు మాత్రమే నామినేషన్లు వేశారు. మెదక్ మున్సిపాల్టీలో మొత్తం 103 నామినేషన్లు వచ్చాయి. ఇందులో 36 బిఆర్ఎస్, 41 కాంగ్రెస్, 15 బిజెపి, 02 ఎంఐఎం పార్టీ,09 మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే నర్సాపూర్ మున్సిపాల్టీలో మొత్తం 49 నామినేషన్లు వచ్చాయి.అందులో 13 కాంగ్రెస్, 11 బిఆర్ఎస్, 07 ఇండిపెండెట్, 15 బిజెపి, 01 సిపిఎం,02 ఏడిఆర్పీ అభ్యర్థులు నామినేషన్ వేశారు. అలాగే తూప్రాన్ మున్సిపాల్టీలో మొత్తం 52 నామినేషన్లు దాఖలు చేశారు. అందులో 15 కాంగ్రెస్, 28 బిఆర్ ఎస్,08 బీజేపీ,01 బీఎస్పీ ఉన్నాయి. రామాయంపేట మున్సిపాల్టీలో మొత్తం 51 నామినేషన్లు వచ్చాయి. అందులో 24 కాంగ్రెస్, 13 బిఆర్ఎస్, 10 బీజేపీ,04 స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. ఆయా మున్సిపాలిటీల్లో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను జిల్లా సాధారణ పరిశీలకులు రవి కిరణ్,అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి మెదక్ మున్సిపల్ లో పరిశీలించారు. నామినేషన్లకు చివరి రోజు శుక్రవా౦ర నామినేషన్లు భారీగా పడే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

# మున్సిపల్ ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల

**ప్రజాపక్షం /సంగారెడి:**సంగారెడ్డి మున్సిఫల్ ఎన్నికల బరిలో నిలిచే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను టీజీఐఐసి చైర్మేన్ నిర్మలా జగ్గారెడ్డి అధికారికంగా గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె వార్డుల వారీగా అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలందరూ ఐక్యంగా పని చేయాలని సూచించారు ఈ సమావేశంలో తోపాజీ అనంతకిషన్, బొంగుల రవి ,కూన సంతోష్ కుమార్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.పెండింగ్ వార్డులు 4,22,33 వార్డుల అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. 1వ వార్డు కుమ్మరికృష్ణ, 2వ వార్డు ఆవుల సునీత , 3వవార్డు నాంచారీ కుమార్, 5వ వార్డు బీబీ పూర్నూర్ జహా , 6వ వార్డు ఎండి ఖాజీ నవాజుద్దీన 7 వవార్డు వంశీకృష్ణ, 8వ వార్డు భూమేష్, 9వ వార్డు శ్రీలత శ్రీశైలం, 10 వార్డు శైలేందర్‌రెడ్డి, 11వ వార్డు గడ్డం తుల సీరాం, 12 వార్డు ప్రవీణ్,( సిఎస్ఐ ) 13 బ్యాగరీ వీణా కుమారి, 14వవార్డు భవాని శంకర్, 15వ వార్డు దన్నారం సుస్మితా , 16వవార్డు శాంతి, 17 వవార్డు జ్యోతి, 18 వవార్డు యశశ్విని, 19 వ వార్డు గుర్రం జాన్సీ, 20వ వార్డు అనీష్ సుల్తానా, 21వ వార్డు తోపాజీ వీణా హరీష్, 23 వవార్డు, కూనవనిత, 24వ వార్డు ఉల్పత్ సుల్తానా, 25వ వార్డు ఆయూశా సుల్తానా, 26వవార్డు శేఖ్ షఫీ ఆషీజ్, 27వవార్డు ఎం,శీరీషా శంశికాంత్, 28 సంగీత మహేష్, 29వార్డు నిరుడి మీనా, 30 జి.మనీషా 31, జగ్గరిసతీష్‌రెడ్డి, 32, జగ్గరి రమ్యశ్రీ, 34,రిజ్వాన్ బేగం, (ఆడ్డు) వార్డు 35 గడమంచి నర్సమ్మ, 36 తాతెల్లి మాధురి, 37, జార్జీమాథ్యూష్, 38వవార్డు నదీమ్

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/కౌడిపల్లి:**యువత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ బాలరాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రం లోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి సీఎం కప్ వాలీబాల్, ఖోఖో క్రీడ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ బాలరాజ్ లు మాట్లాడుతూ, వాలీబాల్ బాలురులోలో 5 క్లస్టర్ టీములు పాల్గొనగా రాయిల పూర్ ప్రథమ, కౌడిపల్లి ద్వితీయ, వాలీబాల్ బాలికలను 2 కస్టర్లు పాల్గొనగా బుజరంపేట్ ప్రథమ, వెల్మకనే ద్వితీయ, ఖోఖో బాలికలలో లో 2 క్లస్టర్ల టీంలలో సలాబత్ పూర్ ప్రథమ, వెల్మకనద్వితీయ స్థానంలో గెలుపొందారు అని అన్నారు. మండలంలోని ఐదు క్లస్టర్లలో గ్రామస్థాయి క్రీడ పోటీలు నిర్వహించి మండల స్థాయిలో నేను పొందిన క్రీడాకారులు నియోజకవర్గంలో ఆడుతాతన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ సీఎం కప్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయిలో క్రీడలను ఎంపిక చేసి పంపడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలరాజ్, పిడిలు విజయ కుమార్, శేఖర్, పూర్ణచంద్, పిఈటి లు కృష్ణగౌడ్, అజీమ్, రాయిల పూర్ సర్పంచ్ కుర్మ స్వప్న శేకులు, క్రీడాకారులు విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

**ప్రజాపక్షం/పాపన్నపేట:**గ్రామీణ ప్రాంత క్రీడాకారులు క్రీడల్లో కష్టపడి విజయం సాధించి జాతీయస్థాయికి ఎదగాలని పాపన్నపేట తహిసిల్దార్ సతీష్ , ఎంపీడీవో విష్ణువర్ధన్ సూచించారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో రెండు రోజులపాటు నిర్వహించనున్న సీఎం కప్ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రతాప్ రెడ్డి, హెచ్ఎం మహేశ్వర్, పిడి రమేష్ తో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల క్రీడాకారులు పలు పాఠశాలల పీడీలు పాల్గొన్నారు. పురపోరులో భార్యభర్తలు నామినేషన్లు

# ప్రజాసేవే లక్ష్యంగా ముందడుగు...కాంగ్రెస్

**ప్రజాపక్షం/రామాయంపేట:**రామాయంపేట మున్సిపల్ పోరులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా బార్యభర్తలు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. పట్టణంలోని 1వ వార్డు నుండి గజవాడ లావణ్య, 7వ వార్డు నుండి గజవాడ నాగరాజులు గురువారం నామినేషన్ వేశారు. ప్రజాసేవే లక్ష్యంగా బార్యాభర్తలు ఇద్దరు ఎన్నికల బరిలో నిలిచి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాజీ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, ఆయన సతీమణి గజవాడ లావణ్య పోటి చేస్తున్నారు. గజవాడ నాగరాజు గతంలో కౌన్సిలర్‌గా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి సేవలందించారు. మంచితనంతో పేరుగాంచిన ఆయన ఆపద సమయాల్లో అందరిని ఆదుకోవడంలో ముందుంటాడని ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. రామాయంపేట మున్సిపల్ చైర్మెన్ పీఠం జనరల్ మహిళకు కేటాయించడంతో నాగరాజు బార్య లావణ్యను బరిలో నిలిపాడు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ప్రజా సేవకు నిరంతరం పాటుపడుతామని, రామాయంపేట పట్టణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుల సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

# విద్యార్థుల భద్రత కోసం ప్రహరీగోడ నిర్మాణం..

**ప్రజాపక్షం/శివ్వంపేట :** పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భద్రత కోసం ప్రహరిగోడ నిర్మాణానికి కృషి చేస్తున్నామని పెద్దగొట్టిముక్క సర్పంచ్ మోకాళ్ల నవీన్ అన్నారు. ఉపాధి హమి నిధులు రూ. 10లక్షలతో చేపడుతున్న జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరిగోడ నిర్మాణ పనులను గురువారం ఆయన సర్పంచ్ నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రత కోసం ప్రహరి నిర్మాణం అవసరం ఉందని గతంలో నివేదికలను పంపించడం జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ హాయంలో ప్రహరిగోడ నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అల్లాడి ఆంజనేయులు, పాఠశాల ఛైర్మన్ బేరి లావణ్య, హెచ్ఎం సురేష్, మాజీ ఎంపీటీసీ సేగూరి మహేశ్‌గౌడ్, వాకిటి వీరారెడ్డి, మురళీరెడ్డి, మంగలి ఆంజనేయులు, అల్లాడి వీరేశం, లాలొల్ల నవీన్, చెత్రి మల్లమ్మ, మంత్రి వైష్ణవి, హరీశ్, సేగూరి లత, చాకలి లక్ష్మి , సామల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం కప్ క్రిడాలు ప్రారంభించిన నాయకులు




**ప్రజాపక్షం/రేగోడ్:**మండల కేంద్రంలోని ఆయా గ్రామాల క్రీడాకారులతో ని సీఎం కఫ్ పోటీలు ప్రారంభించారు అనంతరం రైకోడ్ పిఎస్ ఎస్ మెంబర్ మున్నూరూ కిషన్ మాట్లాడుతూ క్రీడలతోని మానసిక ఉల్లాసాన్ని కలిగిస్లుందని అన్నారు ఈ క్రీడల్లో రేగోడ్ కబడి బాలికలు వాలీబాల్ గజవాడ గెలుపొందారని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు దిగంబరావ్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఫర్యీనా సుల్తాన్ మాజీ కోఆప్షన్ చోటు మియా స్థానిక ఎస్సై పోచయ్య ఏపీడీవో సీతారామవ్వ మండల విద్యాధికారి గురుసాథ్ సుశీల మార్కెట్ డైరెక్టర్ లక్ష్మణ్ ఫాజిల్ పచాయతీ సెక్రెరీ అరుణ్ తదితరులు పాల్గొన్నారు

# కెసిఆర్‌కు నోటీసులు పంపడం దుర్మార్గం

### పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** తెలంగాణ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కు సిట్ నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడు రాజకీయానికి, అధికార మదానికి ప్రత్యక్ష నిదర్శనమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం, తన వైఫల్యాలను దాచుకోవడానికి కేసీఆర్ మీద కక్ష సాధింపు రాజకీయాలను సాగిస్తోందని ధ్వజమెత్తారు. పాలన చేతకాక, ప్రతిపక్ష నాయకులను భయపెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ అసలు అజెండా అయిందని ఘాటుగా విమర్శించారు.తెలంగాణ రాష్ట్ర సాధన నుంచి అభివృద్ధి వరకు ప్రతి అడుగులో ప్రజల కోసం పోరాడిన కేసీఆర్ ను సిట్ నోటీసులతో భయపెట్టాలనుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ భ్రమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ నిజాయితీ, నిబద్ధతపై ప్రజలకు ఎలాంటి అనుమానం లేదని తెలిపారు.ప్రజల మద్దతు కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం, రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు, సిట్ నోటీసులు, విచారణల పేరుతో దాడులకు దిగుతోందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి కాదా? అని ప్రశ్నించారు.ఇలాంటి నీచమైన రాజకీయ కుతంత్రాలను బిఆర్ఎస్ పార్టీ గానీ, తెలంగాణ ప్రజలు గానీ ఎప్పటికీ సహించరని, కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి త్వరలోనే ప్రజలే బుద్ధి చెబుతారని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు.కేసీఆర్‌ను తాకితే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకినట్టేనని, ఈ రాజకీయ వేధింపులకు గట్టి ప్రతిఘటన తప్పదని ఆయన స్పష్టం చేశారు.

## ఉచిత మొబైల్ వైద్య శిబిరం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ సాయిబాబా మందిరంలో గురువారం బిర్లా ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 98 మంది భక్తులు, పేద ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించగా, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సిద్దార్థ ఉచితంగా మందులు పంపిణీ చేసి, అవసరమైన వైద్య సలహాలు సూచనలు అందించారు.ఈ కార్యక్రమాన్ని మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ ప్రారంభించి మాట్లాడుతూ, భక్తులకు, పేద ప్రజలకు సేవ చేయాలన్నదే షిరిడి సాయి సేవా సమాజ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ప్రతి నెల కనీసం రెండు గురువారాలు క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నవీన్, సుజాతతో పాటు సిబ్బంది సాయి కృష్ణ రాజు తదితరులు పాల్గొని సేవలు అందించారు.

## మున్సిపల్ ఎన్నికల ఆర్‌ఓ బాధ్యతల్లో బండి భాస్కర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నెక్కొండ:**నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్ ఆఫీసర్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన బండి భాస్కర్‌రెడ్డి పనితీరును జిల్లా స్థాయి అధికారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ మహన్యా ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఉద్యోగంలో నిబద్ధత, క్రమశిక్షణతో అంచెలంచెలుగా నెక్కొండ మండలానికి మంచి పేరు తీసుకువెళ్తున్న భాస్కర్‌రెడ్డి కృషిని గుర్తించి మున్సిపల్ ఎన్నికల వంటి కీలక బాధ్యతలు అప్పగించడంపై ఆయన శిష్య బృందం, మిత్ర బృందం హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం భాస్కర్‌రెడ్డి నిజామాబాద్ జిల్లా దుండిగల్ మండలంలోని మేండొరా గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

## చర్చి నిర్మాణానికి రూ.50వేల ఆర్థికసాయం

**ప్రజాపక్షం/రాయపర్తి:**మండలంలోని పేరికెడ్ గ్రామంలో క్రిస్టియన్ సోదరుల కోరిక మేరకు చర్చి నిర్మాణ పనులకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లేతాకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, గజవెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, చందు రాము, భాషబోయిన ఎల్లయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు బొమ్మెర వీరస్వామి, మాజీ సర్పంచ్ చిన్నాల రాజబాబు, మాజీ ఎంపిటిసి బండి రాజబాబు, భాషబోయిన సుధాకర్, మంగిశెట్టి రాజు, ఆకారపు దేవేంద్ర చారి, మాకినేని కిట్టారావు, ఆకుల సమ్మయ్య, బండి నరసయ్య, బొమ్మెర రాజు, ఊగ యాకూబ్, ఉగ సతీష్, ఉగ ఉమేష్, ఉగ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## బహుజన మహనీయుల స్ఫూర్తితో సమన్యాయ పోరాటం

### బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలస సుధీర్



**ప్రజాపక్షం/వరంగల్ లీగల్ :** భారతదేశంలో వేల సంవత్సరాల నుండి అణచివేతకు వ్యతిరేకంగా విముక్తి పోరాటాలు చేసిన త్యాగధనులు బహుజన మహనీయుల ఉద్యమ స్ఫూర్తిని అణగారిన సమాజానికి తెలియజెప్పడం ద్వారా దేశంలో సమ న్యాయం సాధించవచ్చని, సామాజిక న్యాయ పోరాటంలో బహుజన న్యాయవాదులు ముందుండాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలస సుధీర్ లు అన్నారు. గురువారం వరంగల్ జిల్లా కోర్టు ఆవరణలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ 2026 కాలెండర్ ను ఆవిష్కరణ చేసి వారు మాట్లాడారు. దేశ ప్రజల విముక్తి కోసం పోరాటం చేసి ఎన్నో హక్కులు సాధించిపెట్టిన మహనీయుల చరిత్రతో కాలెండర్ ముద్రించడం గొప్ప విషయమని అన్నారు. బహుజన మహావీరుల చరిత్రను న్యాయవాదులకు బోధించి చైతన్యం చేయాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ చట్టం, రాజ్యాంగాన్ని అధ్యయనం చేసిన న్యాయవాదులకు దేశ వాస్తవ చరిత్ర తెలియాల్సిన అవసరముందని, న్యాయవాదులను చైతన్యం చేస్తే 90 శాతం బహుజన సమాజం చైతన్యం చెంది బహుజన రాజ్యాధికార పోరాటానికి బాటలు పడతాయని అన్నారు. ప్రపంచానికి విలువలు బోధించిన గౌతమ బుద్ధుడు, ఆధునిక భారత దేశంలో అణగారిన ప్రజలకు, మహిళలకు విద్యనందించి, సత్య బోధన చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే, బ్రిటిష్ కాలంలోనే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందించి సామాజిక న్యాయానికి బాటలు వేసిన సాహు మహారాజ్, దేశంలో అడ్డమైన మూఢాచారల వల్ల జరుగుతున దోపిడి నుండి బయటపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, దయ్యాల సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిల్లా రాజేంద్రప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పంచగిరి బిక్షపతి, రాష్ట్ర కమిటి సభ్యులు జున్ను పద్మ, ఎగ్గడి సుందర్ రామ్, వరంగల్ జిల్లా కన్వీనర్ విలాసాగరం సురేందర్, హనుమకొండ, వరంగల్ బార్ ఐ ఎల్ పి ఎ కన్వీనర్లు పెండ్యాల అనిల్, పూసపాటి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ నాయకులు చింత సాంబశివరావు, రమాకాంత్, శశిరేఖ, శ్రీధర్ గౌడ్, నిర్మలా జ్యోతి, అరుణ, న్యాయవాదులు మల్లయ్య యాదవ్, ప్రవీణ, సంధ్య, జె జె స్వామి, భవాని ప్రసాద్, జన్ను ప్రభాకర్, జార్జ్, సాంబయ్య, పద్మ, రేష్మ, బరుపటి వినయ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క-సారలమ్మలకు భక్తుల మొక్కులు



**ప్రజాపక్షం /నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్, పులిగిల్ల గ్రామ శివారులో సమ్మక్కసారలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతర నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు.గురువారం సాయంత్రం సమ్మక్క గద్దె వద్దకు కంఠాత్మకూర్, పులిగిల్ల గ్రామ పూజారులు సమ్మక్క తల్లిని భక్తిశ్రద్ధలతో డప్పు వాయిద్యాలతో ఘనంగా ఊరేగింపుగా తీసుకువచ్చి గద్దే వద్దకు శివశక్తుల పూనకాలతో తీసుకురాగా భక్తులు ఎదుర్కోళ్లను ఇచ్చారు.సమ్మక్క తల్లిని గద్దెపైకి తీసుకురావడంతో భక్తులు ఎత్తు బంగారం (బెల్లం ) మొక్కులు చెల్లించుకున్నారు.ఈ జాతరలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ హనుమకొండ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.జాతరలో అవంఛానీయ సంఘటన జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. సమ్మక్క తల్లి రాకతో కంఠాత్మకూర్,పులిగిల్ల పులకించిపోయింది.

## రంజాన్‌కు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/జనగామ:**పవిత్ర రంజాన్‌కు పకడ్బందిగా ఏర్పాట్లు నిర్వయించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషషేక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోన సమీకృత కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనగామ ఆర్‌డిఓ గోపిరాం, స్టేషన్‌ఘనపూర్ ఎసిపి భీమ్‌శర్మతో కలిసి ఫిబ్రవరి 18 నుండి ప్రారంభం కానున్న రంజాన్ మాసం నిర్వాహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వయించి సమీక్షించారు. పోలీస్, రెవెన్యూ మున్సిపల్ వైద్యారోగ్య, ఆర్‌అండ్‌బి, విద్యుత్, పౌరసరఫర తదతర శాఖల అధికారులతో పాటు పలువురు మత పెద్దలు పాల్గొన్నారు. ఈద్గాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలన, నీటి ట్యాంకర్ ఏర్పాటు చేయాలన, పారిశుద్య నిర్వాహణలో భాగంగా పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. 11.30 గంటల వరకు దుఖానాలు నిర్వయించుకోవచ్చు అన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు పూర్తి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## సీనియర్ జర్నలిస్టు జగదీశ్వర్ మృతి పట్ల వెంకట్రాములు సంతాపం

**ప్రజాపక్షం/పరకాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో సీనియర్ జర్నలిస్ట్ గోగుల జగదీశ్వర్ మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఐ రాష్ట్ర నాయకులు తాటిపాముల వెంకట్రాములు తెలిపారు. జగదీశ్వర్ మృతి పట్ల సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్నేహశీలి, మృదు స్వభావి , వ్యక్తిగతంగా నేను మంచి స్నేహితుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. జర్నలిస్టుగా ప్రజలకు ప్రభుత్వానికి వారిదిగా వారు పని చేశారని, మొగుళ్ల పెల్లి పరకాల ప్రాంతాల లోని ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికి, ఈ ప్రాంతాల అభివృద్ధికి వారు ఎంతగానో చేసిన కృషి మరువరానిదన్నారు. వారి మరణం కుటుంబ సభ్యులకే కాకుండా ఈ ప్రాంత ప్రజానీకానికి తీరనిలోటన్నారు.

## గద్దెపైకి చేరుకున్న సమ్మక్క సారక్కలు



**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలోని పీచర గ్రామశివారులో బుధవారం సమ్మక్క ను గద్దెపైకి తీసువచ్చే క్రమంలో అదే గ్రామానికి చెందిన కొందరు బిఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య రచ్చరచ్చగామారి పోలీస్ యంత్రాంగానికే ముచ్చెమటలు పట్టించేంతగా పరిస్థితి మారేక్రమంలో ఎస్ఐ సురేష్ చాకచక్యంగా తనసిబ్బందితో అల్లరి మూకలను అదులోకి తీసుకొని కోయ పూజారులతో సమ్మక్కను చిలుకల గట్టు నుండి తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్టింపచేశారు.గురువారం సారక్క ను కోయ పూజారులు సాంప్రదాయ పద్దతిలో చిలుకల గుట్టనుండి తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్టించారు,ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ గొల్లెన రమేష్,వైస్‌చైర్మన్ సట్ల రవిందర్,గ్రామసర్పంచ్ మరిజె అనిత నర్సింగారావు,మాజీజడ్పిటీసి కీర్తి వెంకటేశ్వర్లు,మాజీఉపసర్పంచ్ శ్రీధర్‌రెడ్డి భక్తులు భక్తి శ్రద్దలతో అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకోవడం జరిగింది .

## కనకం యాదగిరి మృతి

### దళిత ఉద్యమానికి తీరనిలోటు

**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** హసన్‌పర్తి మండల కేంద్రములో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు, ప్రముఖ అంబేద్కర్ వాధి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండే నాయకుడు రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృదు స్వభావి,స్నేహభిలాషి కనకం యాదగిరి సార్ మృతి దళిత ఉద్యమానికి తీరనిలోటని,యాదగిరి సార్ అలోచన విధానాన్ని, ఆశయాలను కొనసాగించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పులి మహేందర్ కుటుంబానికి విష్ణురెడ్డి పరామర్శ



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 58వ డివిజన్ ఎన్‌జీవోస్ కాలనీ వాసి, మాజీ టిజిఓ వైస్ ప్రెసిడెంట్ పులి మహేందర్ సతీమణి పులి మని నిన్నరాత్రి మృతి చెందారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం వారి నివాసానికి వెళ్లిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణురెడ్డి మని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మహేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన విష్ణురెడ్డి, మని మరణం పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సుధాకర్, సీనియర్ నాయకులు మందల సమ్మయ్య, మేరి, రవీందర్, అక్మల్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కలెక్టర్ పరిశీలన

ప్రజాపక్షం/భూపాలపల్లి :భూపాలపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న రెండో రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, భద్రతా చర్యలు, నామినేషన్ల స్వీకరణ విధానాన్ని ఆయన నేరుగా పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నామినేషన్లు దాఖలు చేయుట లో సలహాలు, సూచనలు కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు జనవరి 30వ తేది చివరి రోజు కావడంతో నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులతో రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎన్నికల సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల్లో అదనపు సిబ్బందిని నియమించి, క్యాలెన్లు సక్రమంగా నిర్వహించాలని, చట్టబద్ధమైన విధానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నామినేషన్ల వివరాలు రిజిష్టర్ లో నమోదు చేయాలని, సమయం నమోదు చేయాలని ఆదేశించారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని, పోలీస్ శాఖతో సమన్వయం పెంచి శాంతి భద్రతలు పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు వంగ రాజేశ్వర్‌రెడ్డి గురువారం హాజరై వన దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవిత లక్ష్మణ్,మాజీ ఎంపిటిసి గొల్లపల్లి లచ్చయ్య,ఐలయ్య,తిరుపతి,వార్డు మెంబర్ అంజి,కమలాకర్,ముత్తయ్య పాల్గొన్నారు.

**అయ్యప్ప ఆలయ అభివృద్ధికి 30వేలు విరాళం....**

చిన్నకోడూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ హరిపుత్ర అయ్యప్పస్వామి దేవస్థానాన్ని గురువారం వంగ రాజేశ్వర్‌రెడ్డి సందర్శించి,ఆలయ అభివృద్ధి పనుల కొరకు తన వంతుగా 30వేలు విరాళంగా అందజేశారు.

## బివి రాజ్ ఇంజనీరింగ్ కళాశాల సందర్శన

ప్రజాపక్షం/నర్సాపూర్:నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాలను గురువారం కెనడా దేశ న్యూ బ్రన్స్విక్ విశ్వవిద్యాలయానికి చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగం ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ కెన్నేత్ ,బి కెంట్ లు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లికేషన్ గేమ్, రీసెర్చ్, ఎథిక్స్ వంటి ముఖ్య అంశాలపై విస్తృతంగా వివరించారు. పరిశోధనలో నైతిక విలువలు బాధ్యతాయుతమైన ప్రచురణా విధానాలు అకాడమిక్ సామాగ్రత ప్రాముఖ్యతను విద్యార్థులకు అధ్యాపకులకు వివరించారు . ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంజయ్ దుబే, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ పరుచూరి సతీష్ చంద్ర, వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నం భోజనం తిని 17 మంది విద్యార్థులు అస్వస్థత



ప్రజాపక్షం/సంగా–రెడ్డి:నారాయణఖేడ్ మండలం లోని ఎంపిపిఎస్ వెంకటాపూర్ పాఠశాలలో గురువారం రోజు మధ్యాహ్న భోజనం తిని (17) మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు గమనించిన వెంటనే సదరు విద్యార్థులను నారాయణ ఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికు తరలించినట్లు, అందరు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపిపిఎస్ వెంకటాపూర్ పాఠశాలలోవిధులను నిర్వహించడంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన కాశీనాథ్ ఎస్‌జిటీ. ఎంపిపిఎస్ వెంకటాపూర్‌కు షోకేస్ నోటీసు జారీ చేయడం జరిగిందని, ఎంపిపిఎస్ వెంకటాపూర్ మండలం నారాయణఖేడ్‌లో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలైన ఎస్ నాగమణిని విధుల నుండి శాశ్వతంగా తొలగించడం జరిగిందని జిల్లా విద్యాధికారి తెలిపారు. వీరి స్థానంలో మధ్యాహ్న భోజన నిర్వాహణకు నూతనంగా మరొకరిని నియమించిడం జరుగుని తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితా విడుదల

ప్రజాపక్షం /సంగారెడ్డి :సదాశివపేట మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను టీజీఐఐసి చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి అధికారికంగా గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె వార్డుల వారీగా అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలందరూ ఐక్యంగా పని చేయాలని సూచించారు. ప్రత్యర్థుల మైండ్ గేమ్‌లను తిప్పికొట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని ఆమె స్పష్టం చేశారు. మొత్తం 26 వార్డులకు గాను పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలను అధికారికంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జీ అంజనేయులు , సదాశివపేట పట్టణాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ , సిడిసి చైర్మెన్ రాంరెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డు వారీగా అభ్యర్థులు 1వ వారు. పిల్లోడి విశ్వనాథం, 2.వవార్డు ఎలుకల నర్సింలు, 3వ వార్డు, రేణుక చిరంజీవి, 4 వ వార్డు మోయిజ్, 5వ వార్డు ఊత్తేజ ఫాతిమా, 7వ వార్డు అనిత విష్ణువర్ధన్ రెడ్డి , 8వ వార్డు రేణుక శ్రీనివాస్ గౌడ్, 9వవార్డు అరుణ్‌కుమార్, 10 వవార్డు కంది నర్సింలు, 11 వ వార్డు గోపిప్రియాంక; 12వ వార్డు పులిమామిడి మమత రాజు, 13 వవార్డు భవాని విశ్వనాథం, 14 వవార్డు స్వరూప రమేష్, 15వ వార్డు గౌసియా బేగం, 16 వవార్డు, కొత్తగొల్ల చంద్రశేఖర్, 17 వవార్డు, సాజీ, 18వ వార్డు, నిఖిత ప్రేమ్‌కుమార్, 19వ వార్డు ప్రభు నాగరాజు, 20వ వార్డు అంజమ్మ సత్యనారయణ, 21వ వార్డు వాజీద్, 22 వవార్డు పట్నం విజయలక్ష్మి సుభాష్, 23 వవార్డు లక్ష్మి ప్రియ భరత్, 24 వవార్డు కాశీ , 25 వ వార్డు శంకర్‌గౌడ్, 26 హారిక విజయ్, 6 వార్డు అభ్యర్థి ఎవరనేది పెండింగ్‌లో ఉంచారు. అభ్యర్థులందరూ తమ తమ వార్డులలో ప్రచారం వేగవంతం చేసే పనిలో నిమగ్నమైయారు. స్థానిక సమస్యల పరిష్కారం ,పట్టణాభివృద్ధిని ప్రధాన ఏజెండాగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.

## కెసిఆర్‌కు సిట్ నోటీసులు సిగ్గుచేటు

ప్రజాపక్షం/గజ్వేల్:ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసు ఇవ్వడం సిగ్గుచేటు కాగా, కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గానికి ఈ సంఘటన పరాకాష్టగా నిలుస్తుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం గజ్వేల్ లోని కేసీఆర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ లాంటి నిప్పుతో పెట్టుకుంటే భస్మం అవుతారని, సీఎం రేవంత్ రెడ్డి సిగ్గులేని రాజకీయ క్రీడతో మచ్చలేని చంద్రునికి మానసికంగా వేధిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమరణ నిరాహార దీక్షతో కాంగ్రెస్ మెడలు వంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కు నోటీసు ఇవ్వడం ఇవ్వడం తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని ఢిల్లీ బాసులకు తాకట్టు పెట్టడమే అవుతుందని విమర్శించారు. కెసిఆర్ పుణ్యమా అని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోగా, ఆయన పెట్టిన బిక్షతో రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతుండడం తగదని నిలదీశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలం కాగా, తమ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు ప్రజలను దైవర్షన్ చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎంపై ప్రజలు తిరగబడడం ఖాయమని అన్నారు. అయితే మున్సిపల్ ఎన్నికలలో ఓటమి భయంతో రాజకీయ లబ్ధి కోసం విచారణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ లకు సిట్ నోటీసులు ఇచ్చి పైశాచిక ఆనందం పొందుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు మాదాసు శ్రీనివాస్, అనంతుల ప్రశాంత్, దేవి రవీందర్, రామచంద్రం, చంద్రమోహన్ రెడ్డి, ఉడెం కృష్ణారెడ్డి, కుమార్ యాదవ్, రమేష్ గౌడ్, హైదర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా...



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:బక్రిచెప్యాల గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలత శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి పంచాయత్ రాజ్ ఏఇ సౌమ్య,గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీవాణీలతో కలిసి గ్రామ సర్పంచ్ శ్రీలత శ్రీనివాస్‌లు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనాన్ని అన్ని సౌకర్యాలతో నిర్మాణం చేపట్టి వీలైనంత తొందరగా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామంలో మొట్టమొదటి కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి అవసరమగు స్థల సేకరణకు సహకరించిన ప్రతి ఒక్కరికి పాలకవర్గం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన పనులు చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేష్,వార్డు సభ్యులు,గ్రామపెద్దలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న కేంద్ర మంత్రులు

ప్రజాపక్షం/ములుగు:మేడారం మహాజాతరలో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జువల్ ఓరం, ఎస్‌సి ఎస్‌టి సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పలు ప్రత్యేక ఛాపర్ ద్వారా గురువారం మేడారానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ దివాకరలు గిరిజన ఆచార సాంప్రదాయాలతో కొమ్ము కోయ బృందం నృత్యాలతో గద్దెల ప్రాంగణానికి కొమ్ముకోయ కళాకారుల డబ్బుల దరువులు, కొమ్ముల కిరీటాల నృత్యాల నడుమ సాంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు సమ్మక్క సారలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## హుస్నాబాద్‌లో రెండవ రోజు జోరుగా 26 నామినేషన్లు

ప్రజాపక్షం / హుస్నాబాద్ :హుస్నాబాద్ మున్సిపాలిటిమున్సిపల్ రెండవ సాధారణ ఎన్నికల లో బాగంగా గురువారం 20 వార్డుల్లో వివిధ పార్టీల 12 వార్డు నుండి గోనేల మధుకర్, 15 వార్డు నుండి చిత్తారి మంజుల, 16 వ వార్డు నుండి వైద్య కిరణ్, 11వార్డు నుండి పచ్చిమట్ల రవిందర్, 5 వార్డు నుండి రాజ్‌కుమార్ , 6వ వార్డు నుండి భూక్యలక్ష్మన్‌నాయక్, 1 వార్డు నుండి కూతాటి స్వప్న, 2 వార్డు నుండి బూర్గు లత, 1 వార్డు నుండి తోట స్వరూప, 4 వార్డు నుండి బూరవెంకన్న, 11వ వార్డు నుండి పి వరప్రసాద్, 20 వ వార్డు నుండి మేకల వికాస్ యాదవ్, 19 బండి పుష్ప, 1 వార్డు నుండి బాషవేని లక్ష్మి, 10 వార్డు నుండి గడిపె శోభ, 18 వార్డు నుండి ఐలేని అనిత రెడ్డి, 3 వార్డు నుండి లక్కిరెడ్డి తిరుమల, 13 నుండి గందె చిరంజీవి, 9 నుండి బత్తుల శంకర్‌బాబు, 3 వార్డు నుండి కొండ రజిత, 5 వార్డు నుండి రాజు బొల్లి శెట్టి, 7వార్డు నుండి చిత్తారి పద్మ, 10వార్డు నుండి సావుల మంజుల, 8 వార్డు నుండి లత , 8 వార్డు నుండి వేల్పుల కళ్యాణిలు నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజా బాట

ప్రజాపక్షం/కొల్చారం:గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గణిని) స్పష్టం చేశారు. గురువారం కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులతో ప్రజబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి వార్డులో తిరిగి విద్యుత్ సమస్యలు వార్డు సభ్యులను అడిగి తెలుసుకోవడం జరిగింది గ్రామంలో కొత్తగా సింగిల్ ఫేస్ 15 కె. వి. ట్రాన్సార్మర్ లు విద్యుత్ తీగల బిగింపు కొత్త కరెంటు పోల్స్ లో వోల్టేజ్ సమస్య గురించి అధికారులకు తెలియజేయడం జరిగింది. దానికి అధికారులు సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యుత్ శాఖ ఏఈ మహమూద్ అలీ, లైన్ ఇన్స్పెక్టర్, లైన్మెన్ రాధాకృష్ణ,సిబ్బంది సురేష్, నజీర్, పంచాయతీ సెక్రటరీ పణీంద్ర కృష్ణా, ఉప సర్పంచ్ చలం నర్సింలు, వార్డు సభ్యులు సదాల నర్సిములు, రామాంజనేయులు, కదూరి సుశీలా, మానేపల్లి సావిత్రి, గ్రామ ప్రజలు కొంగోటి వీరేశం, రామమ్మా షేకులు, శేకులు, దాది రమేష్, బాగావెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క తల్లి... ఆగమనం

ప్రజాపక్షం/తాడ్వాయి:తెలంగాణ కుంభమేళా మేడారం మహాజాతరలో కీలక ఘట్టమైన సమ్మక్క తల్లిని మాఘ శుద్ధ పౌర్ణమి గురువారం రోజున చిలకలగుట్ట నుండి గిరిజన సాంప్రదాయం ప్రకారం కుంకుమ భరిణి రూపంలో ఆదివాసీ పూజారులు చిలకల గుట్టలో ప్రత్యేక పూజలు నిర్వహించి గుట్టలోని రహస్య ప్రాంతం నుండి కిందకు తీసుకురాగా గిరిజన వడ్డేలు తూతా కొమ్మును ఊదుతూ అమ్మ ఆగమనానికి సంకేతం ఇచ్చారు. డిసిపి ధార కవిత గౌరవ సూచకంగా గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి స్వాగతం పలికారు. బాంబుల శబ్దం వినపడగానే భక్తులు సమ్మక్క నామం జరిపించగా మేడారమంతా పులకించింది. భారీ పోలీస్ బందోబస్తు నడుమ ప్రభుత్వ లాంఛనాలతో చిలకలగుట్ట నుండి గద్దెలపైకి తీసుకువచ్చే క్రమంలో శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం రహస్య పూజలు నిర్వహించి గద్దెలపై సమ్మక్క తల్లిని ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య, గిరిజన పూజారులు ప్రతిష్ఠించారు. సమ్మక్క తల్లి గద్దెలపై కొలువుదీరడంతో నిండు జాతర శోభ సంతరించుకుంది. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు.